# పూలవంతెన

## కె. గోదావరిశర్మ

కాకినాడనీ జగన్నాథపురాన్నీ విడదీస్తూ ఉప్పుటేరు ఒకటుంది. ఆ ఉప్పుటేరు అద్దరినీ ఇద్దరినీ కలుపుతూ ఒక వంతెన వుంది. ఆ వంతెనకి పూర్వం పూల వంతెన అని పేరువుండేదని ఇప్పటివాళ్ళు చాలామందికి తెలియదు. ఇప్పటివాళ్ళు దానిని జగన్నాయకపూర్ బ్రిడ్జి అంటారు.

ఆ బ్రిడ్జి దగ్గరకి వచ్చేసరికి ఇక ముందుకి కదలనని మొరాయించాడు అభినవ్.

"నీకేం పర్వాలేదు. నేనున్నాను పదవయ్యా" అని గోపాలస్వామిగారు ఎంత చెప్పినా మొహం ఎత్తలేదు.

"సరే, పోనీ! వంతెనదాటి అవతలకి వెళ్ళొద్దులే. కాసేపు అక్కడ నిలబడి చల్లగాలి పీలుద్దాం పద" అన్నాడు ముసలాయన, అభినవ్ బుజంమీంచి చెయ్యి తియ్యకుండా.

"చల్లగాలి ఏమిటీ? చేపలకంపు కొడుతూంటే" అన్నాడు అభినవ్, ముఖం చిట్లించి.

గోపాలస్వామిగారు చిరునవ్వు నవ్వేరు. "నీ కిష్టం లేకపోతే వద్దుగానీ చేపల వాసనని కంపు అనెయ్యకు. శంతనుడు మత్స్యగంధిని పెళ్ళాడడానికి చేపల వాసన అడ్డొచ్చిందా? ఆవిడపేరే అదాయెను... అయినా, గాలి వాలు చూసుకుని నిలబడాలేగాని, చేపల వాసన తప్పించి పూల సౌరభాన్ని ఆఘ్రాణించవద్దన్నారా ఎవరైనా?" అని అతణ్ణి చెయ్యిపట్టుకుని అటువైపు నడిపించాడు. అభినవ్ చెయ్యి విడిపించుకోలేకపోయాడు.

మునిమాపు వేళ. ఆకాశంలో అక్కడా ఇక్కడా నక్షత్రాలు పొడుచుకొస్తున్నాయి గాని ఇంకా చంద్రోదయం కాలేదు. ఇప్పుడిప్పుడే పూలవర్తకులు సైకిళ్ళకి స్టాండు వేసి అమ్మకాలు ప్రారంభిస్తున్నారు. మల్లి, పందిరమల్లి, సన్నజాజి, విరజాజి, కనకాంబరాలు. ఓ పక్కగా పలుదోము పుల్లలు కట్టలూ తేగల కట్టలూ పెట్టుకుని ఓ ముసిల్ది కునికిపాట్లు పడుతూంది. వంతెనకి అటువైపు పళ్ళ దుకాణాలు, మిఠాయి బళ్ళూను.

సముద్రంలోకి వెళ్ళిన చేపల పడవలు ఇంకా తిరిగి వస్తూనే వున్నాయి. ఇదివరకే వచ్చినవి ఉప్పుటేరుకి రెండువైపులా చేరుకుంటున్నాయి. ఆ సమయంలో ఆ ప్రాంతం ఏదో పెద్ద హార్బరుని తలపింపజేస్తుంది. నల్లబడుతున్న ఆకాశ నేపథ్యంలో ఆ పడవలు, ఆ ఏరు, ఎవరో చిత్రకారుడి రచనలా భాసిస్తాయి.

గోపాలస్వామిగారు డబ్బయి ఏళ్ళ వృద్ధు. ఎప్పుడూ ఉత్సాహంగా నవ్వుతూ నవ్విస్తూ పండు మీసాలతో పుచ్చా పూర్ణానందంగారిలా వుంటాడు. అభినవ్ పాతికేళ్ళ యువకుడు. ఈ రోజుల్లో పాతికేళ్ళ యువకులు ఎలా వుంటున్నారో అలాగే వుంటాడు.

"అయితే ఎన్నాళ్ళోయ్ ఇలా ప్రణయకలహం పడతారు నువ్వూ నీ పెళ్ళామూనూ?" అన్నాడు గోపాలస్వామిగారు, వంతెన గట్టుకి ఆనుకుని నిలబడుతూ.

'ప్రణయకలహం ఏమిటి నా బొంద' అని మనసులోనే అనుకుని, ఆ మాటలు బయటికి అనడం బాగుండదని. "ప్రణయమూ లేదు, కలహమూ లేదు. అసలు మీ మనవరాలికి ఆ మాత్రం సరసత వుంటే నేను ఇలా ఎందుకుంటాను?" అన్నాడు అభినవ్, కొంతైనా విసుగుని బయట పెడుతూ.

"ఆ, మరీ అలా అనెయ్యకు! మా మనవరాలు మహా చురుకైందని—

ఇంకా ఏదో ఆయన అనబోతూండగానే అభినవ్ అందుకున్నాడు. "ఔనౌను, మీరే మెచ్చుకోవాలి మీ మనవరాలి చురుకుదనం! పేరు మాత్రం మహబాగా పెట్టేరు 'నవీన' అని! 'ప్రాచీన' అని పెట్టవలసింది. మీ సెలక్షనేనా అది?" అన్నాడు. ఇంతవరకు ఆయన ఇచ్చిన చనువుని వినియోగిస్తూ.

"కాదులే. మీ మామగారు పూర్వాశ్రమంలో కమ్యూనిస్టు కాదూ! అతను పెట్టుకున్న పేరే అది. నన్నడిగితే వంక జాబిల్లి అనో వెన్నెల గోదావరి అనో సలహా చెప్పనూ?"

"పేరేదయితే ఏం లెండి! భావాలన్నీ అమ్మమ్మ భావాలేగా..." అన్నాడు పట్టువదలని విక్రమార్కుడు.

"అమ్మమ్మ భావాలు, పోలికలూ వస్తే బాగానే వుండును" అన్నాడు గోపాలస్వామిగార్రు, ముసిముసి నవ్వులు నవ్వుతూ. "దాని అమ్మమ్మ అంటే నా ఉత్తమార్థం— ఎలా వుండేదో నీకు తెలియదు. అప్పుడే కాదు, ఇప్పుడూను. మా ఊరు రమ్మంటే రారు మీరు...... వచ్చి నాలుగురోజులుంటే సంసార కళ అంతా హస్తామలకంగా వుంచకపోయామా?" అని కూడా అన్నాడు.

అభినవ్ ఈయనగారి రసికత గురించి కొంత వినక పోలేదు. కాని ఆయనే స్వయంగా ఇలా మాట్లాడడం ఆశ్చర్యంగానే వుంది. "మీరంటే ఏదో ఎక్సెప్షన్ లెండి. అందరు ముసలాళ్ళూ మీలా వుంటారా" అన్నాడు, అప్పటికీ. పెద్దదిక్కు అనేది ఇలా ఎందుకు వద్దంటారు కుర్రాళ్ళు?

"అందరి సంగతీ మనకెందుకోయ్? వచ్చినవాళ్ళే వాళ్ళనుకో... ప్రేమామృతం తాగినవాళ్ళకి వృద్ధాప్యం వయసుకే గాని మనసుకి రాదు. దాని రుచి తెలియని వాళ్ళు— శ్రీశ్రీ రాశాడు చూడు— కొంతమంది కుర్రవాళ్ళు పుట్టుకతో వృద్ధులని— జీవితాంతం అంతే......" ప్రేమగా మనవడి వెన్ను నిమురుతూ అన్నాడు గోపాలస్వామి గారు.

మౌనంగా వున్న అభినవ్‌కి హఠాత్తుగా ఈయన తనని మెస్మరైజ్ చెయ్యడమో హిప్నటైజ్ చెయ్యడమో గాని లేదుకదా అనిపించింది. అత్తారి తరఫున రాయబారానికి వచ్చిన కొంటె గోపాలస్వామి కాదుగదా అనిపించింది. కొంత బిగుసుకున్నాడు.

"చూడు" అని మళ్ళీ అందుకున్నాడు, మదనగోపాలస్వామిగారు. "అంచక్కటి ఆ సర్వవరం మల్లెమొగ్గలు చూస్తూంటే ఓ నాలుగు మూరలు తీసుకెళ్ళి భార్య జడలో తురమాలని అనిపించడం లేదూ నీకు?" అన్నాడు, కవ్విస్తున్నట్టు.

చల్లగాలీ మల్లెపూలూ అప్పుడే విరుస్తున్న వెన్నెలా ఈ సరస సంభాషణా అన్నీ కలిసి తన బింకాన్ని సడలిస్తున్నాయని గ్రహించిన అభినవ్, మనసు మరింత గట్టిపరచుకున్నాడు. "అనిపించి ఏం లాభం? జడలో పూలు పెట్టాక ఆ మొహం ఇటు తిప్పకోవాలనిపించాలా వద్దా?" అన్నాడు, నిస్పృహగా కాక పరుషంగా ధ్వనించాలని ప్రయత్నిస్తూ.

అతడికేసి విశితంగా, నిశ్శబ్దంగా చూశాడు గోపాలస్వామి గారు. వంతెనమీంచి దడదడలాడుతూ ఒక లారీ వెళ్ళిపోయాక మళ్ళీ కొంత ప్రశాంతత అలముకొంది.

కోపాన్ని కష్టపడి మరో డిగ్రీ పెంచాడు అభినవ్. "అయినా ఏమిటి మీ ఉద్దేశ్యం? నన్నెలాగో మాటలతో లోబరుచుకుని వాళ్ళింటికి తీసుకుపోదామనేనా?" అని అడిగేశాడు గబగబా. కాని వెంటనే సిగ్గుపడ్డాడు, అలా టాక్ట్ లేకుండా బయట పడిపోయినందుకు.

గోపాలస్వామిగారు నవ్విన నవ్వుకి వెండి మీసాలు విచ్చుకుని విదియ వెన్నెల వడి దంతకాంతి మరింతగా వెలిగింది. "బావుందోయ్! అక్కడ మా ఊళ్ళో మా పండు తమలపాకు నాకోసం ఎదురుచూస్తూ వుండగా, అక్కడికిపోయి తాంబూలం వేసుకోక— మీ అత్తవారికి నేనేం కమీషను ఏజంటు ననుకున్నావా? ఏదో మా ముద్దుల మనవరాలు— లేత తువి తమలపాకు

లాంటి పిల్ల— నిన్న రాత్రంతా నిద్దరలేక ఆపసోపాలు పడుతూంటే పోనీ కదా అని గుడ్ సమేరిటన్ పాత్ర పోషిస్తున్నాను కాని......''

అభినవ్ మూతి ముడుచుకున్నాడు.

''అసలు నిన్న సాయంకాలం రైలు దిగి గుమ్మంలో అడుగు పెట్టేటప్పటికి వుందక్కడ. నీళ్లు పోసుకుంది కాబోలు, అమ్మదగ్గరకొచ్చిందను కున్నాను. మీ అత్తగారి నడిగితే ఇంకా అలాటిదేమీ లేదంది. చీకటి పడ్డాకో, కనీసం భోజనాల వేళకో గులాబీలు ఓ చేత, జిలాబీలు ఓ చేతా పట్టుకుని నువ్వొస్తావేమోనని చూశాను. రాలేదు. నువ్వక్కడ కాకినాడలో ఒంటరి పక్కమీద, అదిక్కడ జగన్నాథపురంలో పుట్టింటానా? మీ మావగారు సరే, యాభైఏళ్లకే సన్యసించేడు, మా పిల్లయినా కూతిరి సంగతి గమనించవొద్దూ? ఇహ లాభం లేదని— పాపాల భైరవుణ్ణి నేనే— పొద్దున లేచి ఏమిటే పిల్లా! కథా కమామీషూ అని బుజ్జగించి అడిగితే మెల్లిమెల్లిగా ఒకటొకటే చెప్పకొచ్చింది. అంచేత ఈ రాత్రయినా మీకు జాగారం తప్పించాలనిగాని, లేకపోతే నాకేమిటోయ్?'' అన్నాడు గోపాలస్వామిగారు.

అభినవ్ అలకసుందరుడి ఫోజు మార్చలేదు. ''ఆహా, తను చెప్పినవన్నీ విని నమ్మేసి, నన్ను చివాట్లేస్తున్నారా? నేను మాత్రం నా వెర్షన్ మీకేం చెప్పను లెండి'' అన్నాడు, బెట్టుగా.

''చెప్పకు. ఎందుకంటే మీరు చెప్పకపోయినా తెలుస్తూనే వుంది మీ వ్యవహారం. నేను నిన్నేమీ చీవాట్లు వెయ్యడం లేదు నాయనా! నేనెంతటి వాణ్ణి? అయినా, ఆలుమగల మధ్య ఈ మాత్రం భేదాభిప్రాయాలు లేనిదే కథ రక్తి కట్టదన్నాడు శాస్త్రకారుడు. అంచేత, నువ్వేమీ చెప్పొద్దు గాని, నేను చెప్పేది విను. సలహా కాదు. చమత్కారమైన సంఘటన ఒకటి. నా పెళ్లయిన కొత్తల్లో ముచ్చట. అంటే అర్ధ శతాబ్దం కిందటి మాటన్నమాట......''

అభినవ్ ఊరిలోని వీథిదీపాల వరసకేసి చూస్తూ ఆసక్తిగానే వింటున్నాడు.

''నా కప్పుడు ఇరవయ్యో ఏడు. కొత్తగా పెళ్లయింది. ఏరు మాంచి పోటులో వుండేదిలే! మల్లెపూలు కొంటే బుట్టతోనే బేరమాడడం గాని మూరలూ బారలూనా? పూలదండలేమిటి, చందనచర్చలేమిటి, ఏక పంక్తి భోజనాలేమిటి, ఘుమఘుమల తాంబూలాలేమిటి, చెట్టాపట్టాలు వేసుకుని షికార్లేమిటి, వెన్నెల్లో సంగీతాలేమిటి— ఓహ్! ప్రతిరోజూ పండగే, ప్రతిరాత్రీ శోభనమే... అలాంటి ఓ రాత్రి మా చిలక అలిగింది. కారణం నేనే. హాస్యానికి ఏదో అనబోతే దానికి అనుకోని ధ్వని ఏదో వచ్చింది. ఇక అలక అంటే అలాగా ఇలాగానా? వెంటనే మాటా పలుకూ లేకుండా లేచి కట్టుబట్టలతో గుర్రబ్బండి ఎక్కి ఎకాఎకి ఆరుమైళ్ల దూరానవున్న పుట్టింటికి ప్రయాణం...... సరసం విరసమైందేమిట్రా భగవంతుడా అని నేను శాస్త్రోక్తంగా బతిమాలబోయినా, ఏదీ, నాకా అవకాశం ఇస్తే కద! లేడికి లేచిందే పరుగు...

''సరే, చేసేందేం లేక రాత్రంతా చుక్కలు లెక్క పెడుతూ కూర్చున్నాను. ఒంటరితనం అంటే ఏమిటో



తెలుసా? పడవంత పందిరిపట్టెంమంచం మీద ఏరంత తెల్లదుప్పటి పరిచి బుట్టెడు మల్లెపూలు కుమ్మరించి, ఒక్కర్తినీ పడుకోవలసి రావడం అన్నమాట! నీకూ అనుభవం అయే వుంటుందిలే, నిన్న రాత్రీ మొన్న రాత్రీను! సరే, ఆవేశంలో వెళ్లిందిగాని అక్కడ అమ్మ గారింట్లో తనూ అంత అవస్థా పడివుంటుంది కదా, తెల్లారేక వల్లబడి తిరిగి వచ్చేస్తుందనుకున్నాను. రాలేదు. నేనూ వెళ్లలేదు. కలిసి కాపురం చెయ్యడం ఇద్దరి అవసరమూ కదా, తను కొండెక్కి కూచుంటే నేను మాత్రం ఎందుకు మెట్టు దిగాలి? సంసారం అంటే సగం స్వార్థం, సగం త్యాగమూను. నిష్పత్తి చెడితే వ్యవహారం చెడుతుంది......"

తన అభిప్రాయమూ అదేనన్నట్టు అంగీకారపూర్వకంగా తల ఊపేడు అభినవ్.

"అలా ఆలోచించి ఆవేళ నేనే చెయ్యి కాల్చుకున్నాను. కాని వెన్నెలవేళకి చూశావూ, గుండె గుబగుబలాడిపోయింది. ఎక్కడలేని శంకలూ బయలుదేరాయి. అసలే అమాయకపు పిల్ల సరిగ్గా ఇల్లు చేరుకుందా? రాత్రి చీకట్లో అలా వెళ్లింది కదా, ఏ ఆపదా రాలేదు కద! చిన్నప్పటినుంచీ తెలిసిన తోవ, తెలిసిన బళ్ల వాళ్లూ, భయమేమీ లేదనుకో... కాని చెప్పలేం చూడూ... లేకపోతే అక్కడికి వెళ్లి మంచం ఎక్కిందా? పగలంతా ఎందుకు రాలేదు? మనసు కీడు శంకించడం ప్రారంభిస్తే ఇక ఎక్కడలేని భయాలూ తోచుతాయి చూడు..." తాపీగా ఒక్కొక్క వాక్యమే చెపుతూ మనవడి రియాక్షను గమనిస్తున్నాడు గోపాలస్వామి గారు.

ఆయన అనుకున్నట్టే అభినవ్ కళ్లలో ఆందోళన తొంగిచూసింది. నీళ్లమీద వెన్నెల తళతళలకేసి చూస్తూ నెర్వస్‌గా పెదవి కొరుక్కుంటున్నాడు.

చిరునవ్వుతో తల పంకించి కొనసాగించేడు గోపాలస్వామి గారు. "ఇక మరి ఆగలేకపోయాననుకో! అంత అబ్బురంగా పెరిగిన పిల్లని అలా ఒక్కర్తినీ రాత్రిపూట ఎందుకు వెళ్లనిచ్చానా అని నన్ను నేను తిట్టుకున్నాను. అదీ కాక, ఆలోచిస్తే నాకనిపించిందేమిటంటే ఆడవాళ్లు అలుగుతారు. అది వాళ్ల జన్మహక్కు. అదో అందమైన విలాసం. మనం బతిమాలాలి. ఇది మన అందమైన బాధ్యత. ఈ రెండూ వుంటేనే సంసారంలో శృంగారం. పెళ్లాం అలిగిందని విసుక్కుని కోపం తెచ్చుకునేవాడు మూర్ఖశిఖామణి అన్నమాట..." మెత్తగా మాటల్ని వదులుతూ క్రీగంట చూస్తున్నాడు గోపాలస్వామి గారు.

అభినవ్ ఇబ్బందిగా దిక్కులు చూస్తూ బుర్ర గోక్కున్నాడు. పశ్చాత్తాపం కళ్లలో తొంగిచూసింది గాని నోటివెంట రావడానికి అతిశయం అడ్డుపడింది. అదీగాక ముసలాయన ముందు బయటపడిపోవడం చిన్నతనం కాదూ......

ఇక అతణ్ణి ఎక్కువసేపు మాటలతో ఇబ్బంది పెట్టడం అనవసరం అని గ్రహించాడు గోపాలస్వామి గారు. అంచేత కథ చకచకా కొనసాగించేడు. "ఆ విధంగా నా లోకజ్ఞాన నేత్రం తెరుచుకునేసరికి మరి ఒక్క క్షణం ఆగలేదు. పూల దుకాణానికి వెళ్లి బేడ ఇచ్చి నాలుగు మూరలు మల్లెపూలు కట్టించాను. మరీ బుట్టతో తీసుకువెళితే చూసినవాళ్లు అసూయ పడతారని. అప్పటి మూర అంటే ఇప్పట్లాగా ఏమిటి? అదిగో చూడు, ఆ పదేళ్ల గుంటడు అమ్ముతున్నాడు అక్కడ— వాడి మూర ఎంతుంటుంది? పైగా కొంత దండ సాగదీసి, కొంత చెయ్యి ముడిచీ వ్యాపార కళంతా ప్రదర్శిస్తాడు వాడు. ఏతావాతా మూర అంటే మనకి జానెడు కూడా రాదు. అప్పుడు నాలుగు మూరలంటే పూల బరువుకి తల వాలిపోయి మెడ నొప్పి పెట్టేసేది పాపం...

"ఆ విధంగా సాయుధుడివై" కేతన పటాంచల చంచలమైన తాల్మితో, తిరిగెడు బండికండ్ల భంగిది భ్రమించు మనమ్ముతో' సత్యభామ కోపగృహానికేసి వెళ్లే శ్రీకృష్ణుడిలా వెళ్లేను. తీరా వెళితే ఏముంది? మా హీరోయిన్ ఇంటి అరుగుమీదే ప్రత్యక్షం! వారపత్రిక ఏదో చదువుతూ ఓ వారగా కూచుంది. చెంగు చూసిందని నిర్ధారించుకుని కృంగిపోయేను. తనూ కళ్లతోటే క్షమాపణలు చెప్పేసుకుంది. ఏం లాభం? ఎప్పుడంటే నిన్న రాగానే అంది. నిజానికి నేను రెక్కల్లో గట్టివాణ్ణే. అందులోనూ నాతెగల బ్రహ్మచర్యం అనుభవించే మూడు రోజులూ గుర్తులేకుండా ఉంటాయా? కాని అప్పుడు నవ సంసారులో మరిచిపోయాను. మా పంచదారచిలకకి గ్రహాలు పట్టే ఆ మూడురోజుల సంగతీను.

"సరే, మల్లెపూల పొట్లం విప్పి జాజి పందిరిమీద మంచులో వుంచాను. అవి వాడకుండా వాటిని మేం వాడాలని తాపత్రయం. ఎలా? ఏవో నాలుగు మెతుకులు కతికాననిపించి గోదావరొడ్డుకి ఒక్కణ్ణే వెన్నెల్లో షికారు కెళ్లేను. ఆ రాత్రే కాకుండా మర్నాడు కూడా నాకు వస్తే... ఎలాగా, ఏం పథకం వెయ్యాలా అని తీవ్రంగా ఆలోచించాను. ఆలోచించి ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను.

"తిరిగి వచ్చి మా రాణీగారికి పథకం వివరిస్తే, అమ్మయ్యో అరిచి గుండెలమీద చేతులు వేసుకుని. నీకేం పర్వాలేదు. నేనున్నానన్నాను. లేకపోతే ఎల్లుండి దాకా ఇక్కడే ఇలాగే వుంటావా అన్నాను. పాపం బేలగా నా కళ్లలోకి చూసి సరేనంది.

"మర్నాడు తెల్లారకముందే తల్లిని లేపి స్నానానికి నీళ్లు పెట్టమంది. అదేమిటే నీళ్లు రేపుగదా అంటే కాదు ఇవాళే అని దబాయించింది. ఆవిణ్ణి మరి మాటాడనియ్యకుండా ఊదరగొట్టేసింది. మా అత్తగారు తెలివైనదే. విషయం గ్రహించింది. మరేం మాట్లడకుండా కాగుతో వేణ్ణీళ్లు పడేసి కుంకుడుకాయలు కొట్టి కూతురికి తలంటి స్నానం చేయించింది. ఆరున్నరా అయేటప్పటికి ఉప్మా కాఫీలు పుచ్చుకున్నాం. జాజిపందిరి మీది నాలుగు మూరల మల్లెదండా తీసి తల్లో పెట్టుకుని చెంగున ఎగిరి గుర్రబ్బండిలో నా పక్కన కూచుంది మా పంచదార చిలక. 'అక్కడికి వెళ్లగానే...' అని వాళ్లమ్మ ఏదో రహస్యంగా చెపుతూంటే 'అలాగలాగే' అనేసింది.

"అదయ్యా! అలా జరిగింది! అలా వుండేదన్న మాట ఆ రోజుల్లో..." అని ముగించాడు గోపాలస్వామి గారు, రెస్ట్‌లెస్‌గా, ఎప్పుడు తప్పించుకుందామా అన్నట్టు చూస్తున్న అభినవ్‌ని ఓరకంట చూస్తూ.

అభినవ్ మహా బాధ పడిపోతున్నాడు. సరే, తోవ చెప్పేరు కదా, ఇక నన్నొదిలెయ్యండి, నా దారి నేను చూసుకుంటానని ముసలాయనతో ఎలా చెప్పడమా అని అతలాకుతలమై పోతున్నాడు.

అతడి అవస్థ గమనించి నవ్వుకున్నాడు గోపాలస్వామి గారు. రిస్టువాచీ చూసి, "అబ్బో, చాలా టైము అయినట్టుందే! ఓసారి మనవాళ్లింటికి వెళ్దామా?" అన్నాడు, ఆ ప్రసక్తి ఇంతకు ముందు ఏమీ రానట్టు.

"పదండి" అన్నాడు అభినవ్, తల వంచుకుని.

"ఏమిటి, ఇలా ఉత్త చేతుల్తోనా? ఇంగ్లీషు వాడేమన్నాడు? సే ఇట్ విత్ ఫ్లవర్స్ అన్నాడు. నేనయితే డూ ఇట్ విత్ ఫ్లవర్స్ అంటాను. మనవాళ్లింకా ఈ ఫిలాసఫీ నేర్చుకోవాలి. అప్పు అడిగినప్పుడు మాత్రం మీ డబ్బు మీకు పువ్వుల్లో పెట్టి తిరిగి ఇచ్చేస్తాం అంటారు. డబ్బే కాదు, ఏదైనా పువ్వుల్లో పెట్టే ఇవ్వాలి. ఏ భావాన్నయినా పూల బాసలో పెట్టే చెప్పాలి. మనసుని మనసుని కలపడానికి వంతెన కట్టాలంటే దేనితో కట్టాలి? పువ్వులకంటె సరైన ముడి సరుకు మరొకటి లేదు. అంచేత..." అంటూ అభినవ్‌ని పూల రథం(సైకిల్)కేసి నడిపించాడు గోపాలస్వామి గారు.

పూలు కొంటూ, "కొంపతీసి నేను వెళ్లేసరికి... మీకు జరిగిన పరాభవంలాంటిదే నాకూ జరగదు కద!" అన్నాడు అభినవ్, చిలిపిగా.

గోపాలస్వామిగారు నవ్వేరు. "అది నీకు తెలియాలి. నీ పెళ్లానికి పూలెప్పుడు కొనాలో ఎప్పుడు కొనక్కర్లేదో నేనుటయ్యా చెప్పేది? ఈ కాలం కుర్రాలంతా ఇంతే..." అన్నాడు.

అభినవ్ సిగ్గుపడి, ఆయన వెనక తల వంచుకుని అనుసరించాడు, చేతిలో పూలకానుకతో.

*

"త్వమేవాహం"

కోటి దివ్వెల కాంతి నువ్వు.
కటిక చీకటి భ్రాంతి నేను.
ఒక్క క్షణం నీ హృదిలో
మక్కువతో (గా) వెలగనిస్తే
దివ్వె దివ్వెకు వెలుగు నేనై
మలిగిపోతా నిజము నమ్ము

ఎస్. రాజేశ్వరి